ఏఐ ద్వారా వీడియోను రూపొందిస్తున్న టీచర్ షరీఫ్ అహ్మద్

విద్య ప్రాముఖ్యతపై వీడియో ప్రాజెక్ట్

- ఏఐ ఆధారంగా రూపొందించిన ప్రభుత్వ స్కూళ్ల ఉపాధ్యాయులు
- ఈ వీడియో ద్వారా బడిబాట ప్రచారం

చిగురుమామిడి/కమాన్‌చౌరస్తా(కరీంనగర్) మే 29: ఆ టీచర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి విద్య ప్రాముఖ్యతపై ప్రమోషనల్ వీడియో రూపొందించారు. బడిబాటలో భాగంగా ఈ వీడియోను ప్రదర్శిస్తూ సర్కారు బడుల్లోని సౌకర్యాలు, టీచర్ల వృత్తి నైపుణ్యాలు, బోధనాపద్ధతులను ఇంటింటికీ వెళ్లి వినూత్న ప్రచారం చేస్తూ తోటి ఉపాధ్యాయులు, విద్యావేత్తల ప్రశంసలు అందుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ జడ్పీ స్కూల్ హిందీ టీచర్ షరీఫ్ అహ్మద్, కరీంనగర్ సుభాష్‌నగర్ జడ్పీ హైస్కూల్ తెలుగు టీచర్ మోతె చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ రూరల్ మండలం వట్టెంల హైస్కూల్ హెడ్మాస్టర్ సూర్యనారాయణ విద్యార్థులు, తల్లిదండ్రులకు సర్కారు విద్య ప్రాముఖ్యతపై వినూత్న పద్ధతిలో అవగాహన కల్పించాలని సంకల్పించారు. ఈ దిశగా ఆధునిక పరిజ్ఞానాన్ని అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యావిధానం, సౌకర్యాలు, నాణ్యమైన బోధన తదితర అంశాలను వివరిస్తూ ఇటీవల ఓ ప్రమోషనల్ వీడియాను తయారు చేశారు. దీనిని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయగా మంచి స్పందన లభించింది. అలాగే బడిబాటలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన సందర్భంలో తల్లిదండ్రులకు వీడియోను చూపిస్తూ ఆకట్టుకుంటున్నారు. పిల్లలు సైతం ఈ వీడియోను చూసి ప్రేరణ పొందుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారని షరీఫ్ అహ్మద్ చెప్పారు. కాగా, ఈ సాంకేతికతను జోడించి వీడియోను రూపొందించిన హిందీ టీచర్ షరీఫ్ అహ్మద్, చంద్రశేఖర్‌రెడ్డిని తోటి ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందిస్తున్నారు.

ఇక ఇంటింటికీ వంటగ్యాస్!

- వేగంగా సాగుతున్న పైప్‌లైన్ పనులు
- నాలుగు నెలల్లో పూర్తయ్యే అవకాశం
- మొదట ఎన్టీపీసీ, సింగరేణి క్వార్టర్లకు
- తర్వాత పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పట్టణాలకు..
- సీఎన్జీ గ్యాస్ స్టేషన్లకు సైతం సరఫరా

ఉమ్మడి జిల్లాలో మరికొన్ని నెలల్లో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా జరగనున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ బాధ్యతను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు అప్పగించింది. అందుకు సంబంధించిన పైప్‌లైన్ ఏర్పాటు పనులు పెద్దపల్లి జిల్లాలో వేగంగా సాగుతున్నాయి. నాలుగు నెలల్లో పూర్తి చేసి మొదట ఎన్టీపీసీ, సింగరేణి క్వార్టర్లకు అందించి తర్వాత పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల పట్టణాలతో పాటు సీఎన్జీ స్టేషన్లకు సరఫరా చేయనున్నారు. ఆ తర్వాత ప్రతి ఇంటికీ అందించనున్నారు.

బసంత్‌నగర్ సమీపంలో జరుగుతున్న పైప్‌లైన్ పనులు

పెద్దపల్లి, మే 29 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్ తరహాలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇంటింటికీ వంటగ్యాస్ సరఫరా చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐవోసీకి అప్పగించింది. పైప్‌లైన్ ద్వారా ఇటు వ్యాపార సంస్థలు, చిన్న తరహా పరిశ్రమలు, గృహాలకు గ్యాస్ అందించనున్నారు. పెట్రోల్ బంక్‌ల్లో సీఎన్జీ గ్యాస్ అందుబాటులోకి తీసుకురానున్నారు. అందుకు గ్యాస్‌బంక్‌లను ఏర్పాటు చేయనున్నారు. రామగుండంలో నిర్మించిన గ్యాస్ ఆధారిత ఎరువుల తయారీ కేంద్రానికి ఇప్పటికే తూర్పుగోదావరి నుంచి గ్యాస్ సరఫరాకు పైప్‌లైన్ వేశారు. దీని ద్వారా నివాసగృహాలకు నేరుగా గ్యాస్ ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో గ్యాస్‌స్టేషన్ నిర్మించారు. కనెక్షన్లు ఇచ్చిన వెంటనే గ్యాస్ సరఫరా చేయనున్నారు. మీటర్లు బిగించి వాడిన గ్యాస్‌ను బట్టి బిల్లులు వసూలు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో నివాసాలకు ప్రైవేట్ నేచురల్ గ్యాస్ అందిస్తారు. హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు డిమాండ్‌ను బట్టి సప్లయ్ చేస్తారు. మొదటి దశలో రామగుండం, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల పట్టణాల్లో అమల్లోకి తెస్తారు. వీటితో పాటు బొగ్గు ఆధారంగా నడిచే చిన్న తరహా పరిశ్రమలకు ప్రత్యామ్నాయంగా గ్యాస్ అందిస్తారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లోని ప్లాస్టిక్, ఆటో మొబైల్ ఇండస్ట్రీలకు కనెక్షన్లు ఇస్తారు. అలాగే జిల్లాలోని ప్రధాన మార్గాల్లో సీఎన్‌జీ స్టేషన్లను నెలకొల్పనున్నారు. ఇప్పటికే కరీంనగర్‌లో ఐవోసీ ఆధ్వర్యంలో ఒక సీఎన్‌జీ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రామగుండంలో రెండు స్టేషన్లు నెలకొల్పనున్నారు. కరీంనగర్ వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు మరో నాలుగు నెలల్లో పూర్తి చేయనున్నారు.

40 శాతం ధర తక్కువ

ఎల్పీజీతో పోలిస్తే పైప్‌లైన్‌ల ద్వారా గృహావసరాలకు సరఫరా అయ్యే గ్యాస్ ధరలు 40 శాతం వరకూ తక్కువగా ఉండనున్నాయి. గాలి కన్నా బరువు తక్కువగా ఉండడంతో సేఫ్టీ ఉంటుంది. గ్యాస్ లీకేజీలు, అగ్ని ప్రమాదాల ముప్పు ఉండదు. ఒకవేళ గ్యాస్ లీకైనా వేగంగా గాలిలో కలిసి పోతుంది. ఇండ్లల్లో మీటర్ల రీడింగ్ ఆధారంగా బిల్లులు వేయనున్నారు.

మొదట ఎన్‌టీపీసీ, సింగరేణి క్వార్టర్లకే

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదట ఆర్ఎఫ్‌సీఎల్‌ను ఆనుకొని ఉన్న ఎన్టీపీసీ టౌన్‌షిప్, సింగరేణి క్వార్టర్లకే తొలి కనెక్షన్లను ఇవ్వనున్నారు. అందుకుగాను ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌కు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలని నిర్ణయించారు. ఎన్టీపీసీ, సింగరేణి యాజమాన్యాలతో ఐఓసీ చర్చలు జరుపుతున్నది. సింగరేణి, ఎన్టీపీసీలకు యాజమాన్యం నిర్వాహణలో టౌన్‌షిప్‌లు ఉన్నాయి. రామగుండంలో 16 వేలకు పైగా సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. సింగరేణి కార్మిక కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నది. వేతనాల్లో బిల్లులను కలిపి చెల్లిస్తున్నది. సింగరేణి కార్మిక కుటుంబాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసి రీడింగ్ ప్రకారం యాజమాన్యమే చెల్లించనున్నది.

హనుమాన్ పెద్ద జయంతికి వేళాయె

- కొండగట్టులో జయంత్యుత్సవాలకు అంకురార్పణ
- మూడు రోజులపాటు వేడుకలు

మల్యాల, మే 29 : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలకు వేళయింది. దేశంలో ఎక్కడాలేనివిధంగా ఇక్కడే ఆంజనేయస్వామి రెండు (చిన్న, పెద్ద) జయంతులు నిర్వహిస్తుండగా, బుధవారం సాయంత్రం అర్చకులు యాగశాల శుద్ధి చేసి అఖండ దీపాన్ని వెలిగించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వైశాఖ బహుళ దశమి రోజు ఏటా కొండగట్టులో హనుమాన్ పెద్దజయంతి నిర్వహించడం ఆనవాయితీ. మూడు రోజుల పాటు ఆలయం ముందు ఉన్న యాగశాలలో త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞాన్ని నిర్వహిస్తారు. పెద్దసంఖ్యలో తరలిరానున్న హనుమాన్ దీక్షాపరులతో కొండంత కాషాయమయం కానున్నది. కాగా ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేయనున్నారు. కాగా, పెద్ద జయంతి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి, వేములవాడ రాజన్న ఆలయాల నుంచి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి లక్షలాది మంది దీక్షాస్వాములు కాలినడక, ఇతర మార్గాల్లో కొండగట్టుకు తరలి వస్తారు. అంజన్న సన్నిధానంలో మండల(41), అర్ధమండల(21), ఏకాదశ(11)రోజుల దీక్షలను విరమించి మొక్కులు చెల్లించుకుంటారు.

వార్షికోత్సవానికి 'రాగినేడు' ముస్తాబు

- కోలేటి దామోదర్ గుప్తా ఆధ్వర్యంలో వేడుకలు
- హాజరుకానున్న దేవాదాయ శాఖ అధికారులు

ఉత్సవాలకు ముస్తాబైన స్వయంభూ శ్రీ నాగలింగేశ్వరస్వామి దేవాలయం

పెద్దపల్లిరూరల్, మే 29: పెద్దపల్లి మండ లం రాగినేడు నాగలింగేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవానికి ముస్తాబైంది. గతేడాది స్వయంభూవుగా చెట్టుకింద వెలిసిన శివలింగానికి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ పుష్పగిరి పీఠాధిపతి విద్యానంద శంకరభారతి స్వామి చేతుల మీదుగా పునఃప్రతిష్ఠ చేశారు. గురువారం ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వేములవాడ ఆలయం దత్తత తీసుకున్న నేపథ్యంలో రాజరాజేశ్వరస్వామి ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు, ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజాదికార్యక్రమాలు చేపట్టనున్నారు.

రన్నరప్ కప్‌తో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారులు

హెచ్‌సీఏ టీ20 రన్నరప్‌గా కరీంనగర్

హైదరాబాద్/ కొత్తపల్లి : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిర్వహించిన అంతర్ జిల్లాల టీ20 క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని మెదక్ జిల్లా జట్టు కైవసం చేసుకోగా, కరీంనగర్ రన్నరప్‌గా నిలిచింది. బుధవారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్లో టాస్ గెలిచి, తొలుత బ్యాటింగ్‌కు దిగిన మెదక్ 20 ఓవర్లలో 168/4 స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో కరీంనగర్ 20 ఓవర్లలో 145/6 స్కోరు చేసి, ఓటమి పాలైంది. మెదక్ జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. మెదక్ బ్యాటర్ మహ్మద్ అఫ్రీది అర్ధ సెంచరీ (40 బంతుల్లో 7 సిక్స్‌లు, 2 ఫోర్ల సహాయంతో 80 పరుగులు) రాణించాడు. అఫ్రీదికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు రూ.50 వేల నగదు బహుమతి అందించారు. ముగింపు వేడుకల్లో జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాదిలానే ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించి, ఆ వెంటనే అంతర్ జిల్లాల టీ20 టోర్నీని నిర్వహిస్తామని చెప్పారు. అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి, త్వరలోనే ఈ టోర్నీకి ఒక దిగ్గజ క్రికెటర్ పేరు పెడతామని తెలిపారు. హైదరాబాద్‌లో శాటిలైట్ అకాడమీల ఏర్పాటుతో పాటు జిల్లాల నుంచి వచ్చే క్రికెటర్లకు ఇక్కడ శిక్షణ, వసతి సదుపాయం కల్పించే విషయమై కూడా అపెక్స్‌లో చర్చించి, త్వరలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు రన్నరప్‌గా గెలుపొందడంలో విశేషంగా రాణించిన జట్టు క్రీడాకారులను కరీంనగర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ ఆగంరావు, వైస్ ప్రెసిడెంట్ కే మహేందర్‌గౌడ్, సెక్రటరీ ఎన్ మురళీధర్‌రావు, మేనేజర్ పీ మనోహర్‌రావు అభినందించారు.

కర్ణాటకలో 87 కోట్ల స్కామ్!

- రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ ఖాతా నుంచి అక్రమంగా కోట్ల రూపాయలు బదిలీ
- స్కామ్‌లో మంత్రి నాగేంద్ర హస్తం!
- కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి ఆత్మహత్యతో తాజాగా వెలుగులోకి
- సూసైడ్ నోట్‌లో మంత్రి నాగేంద్ర సహా పలువురు కార్పొరేషన్ అధికారుల పేర్లు
- మంత్రి రాజీనామాకు బీజేపీ డిమాండ్

మంత్రి నాగేంద్ర

బెంగళూరు/శివమొగ్గ, మే 29: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో తాజాగా రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్‌లో రూ.87 కోట్ల స్కామ్ వెలుగుచూసింది. కార్పొరేషన్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కోట్లాది రూపాయలు కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయ్యాయి. ఈ ఏడాది మార్చిలో అక్రమ మార్గంలో నిధులు ట్రాన్స్‌ఫర్ అయినట్టు తెలుస్తున్నది. ఈ కుంభకోణంలో ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి బీ నాగేంద్ర హస్తం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఎస్టీ కార్పొరేషన్‌లో పనిచేసే అకౌంట్స్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకొన్న నేపథ్యంలో ఈ స్కామ్ తాజాగా వెలుగులోకి వచ్చింది. చంద్రశేఖర్ ఆత్మహత్య నోట్‌లో మంత్రి నాగేంద్రతో పాటు పలువురు కార్పొరేషన్ ఉన్నతాధికారుల పేర్లను ప్రస్తావించారు. తన చావుకు కార్పొరేషన్ ఎండీ జేజీ పద్మనాభం, అకౌంట్స్ ఆఫీసర్ పరుశురాం దురుగన్నవర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సుచిస్మిత రావల్ కారణమని చంద్రశేఖర్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల ఖాతాలకు సొమ్ము

ఎస్టీ కార్పొరేషన్‌కు స్థానిక ఎంజీ రోడ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఖాతా ఉన్నది. దాని నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అదే బ్యాంకు ఇతర బ్రాంచ్‌లకు రూ.87 కోట్లు బదిలీ అయినట్టు సమాచారం. ఈ డబ్బు కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల ఖాతాలకు వెళ్లినట్టు తెలుస్తున్నది. ఈ స్కామ్ ఆరోపణలపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది.

నేను రాజీనామా చేయను: నాగేంద్ర

ఎస్టీ కార్పొరేషన్‌లో స్కామ్‌ను మంత్రి బీ నాగేంద్ర మంగళవారం ధ్రువీకరించారు. అయితే తన మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు ఆయన నిరాకరించారు. తనకు ఈ స్కామ్‌లో ఎలాంటి పాత్ర లేదన్నారు.

'బాంబే' బ్లడ్‌గ్రూప్ రక్తదానానికి 400 కిలోమీటర్ల ప్రయాణం

ఇండోర్: బాంబే బ్లడ్ గ్రూప్.. అత్యంత అరుదైన గ్రూప్ ఇది. ఇలాంటి బ్లడ్‌గ్రూపే కలిగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ మహిళ ప్రాణాలు కాపాడేందుకు ఓ వ్యక్తి ఏకంగా 400కుపైగా కిలోమీటర్లు ప్రయాణం చేసి రక్తదానం చేశాడు. మహారాష్ట్రలోని షిర్డీకి రవీంద్ర అష్టేకర్ (36) పూల వ్యాపారి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఓ మహిళ (30) దవాఖానలో ప్రాణాలతో పోరాడుతున్నదని, ఆమెకు అర్జెంటుగా బాంబే బ్లడ్‌గ్రూప్ కావాలన్న వాట్సాప్ మెసేజ్ చూసిన రవీంద్ర వెంటనే స్నేహితుడి కారులో బయలుదేరాడు. 440 కిలోమీటర్లు ప్రయాణించి ఈ నెల 25న రక్తదానం చేసి ఆ మహిళ ప్రాణాలను కాపాడగలిగాడు. అత్యంత అరుదైన బ్లడ్‌గ్రూప్ కలిగిన రవీంద్ర రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడ ఎవరికి అవసరం పడినా వెంటనే వెళ్లి రక్తదానం చేస్తారు. ఇలా మహారాష్ట్రతోపాటు గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో గత పదేండ్లలో 8 సార్లు రక్తదానం చేశారు. బాంబే బ్లడ్‌గ్రూప్‌ను 1952లో కనుగొన్నారు. ఇందులో 'హెచ్' యాంటీజెన్‌కు బదులుగా యాంటీ-హెచ్ యాంటీబాడీస్ ఉంటాయి. వీరికి ఆ గ్రూపు కలిగిన వారే రక్తం ఇవ్వాల్సి ఉంటుంది.

పంట నష్టపోయినా పరిహారం కష్టమే!

- నూతన బీమా పథకంలో శాస్త్రీయత శూన్యం
- రైతు యూనిట్‌గా అమలు లేనట్టే
- పాత పద్ధతిలోనే ఫసల్ బీమా అమలు చేయనున్న ప్రభుత్వం
- ఇతర పంటలను విస్మరించిన రేవంత్ సర్కారు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రైతు యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే పంట నష్టం జరిగినప్పుడు రైతుకు న్యాయం జరుగుతుంది. కానీ, కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనతోపాటు రాష్ట్రం అమలు చేయబోతున్న పంటల బీమా పథకంలో ఈ మూల సూత్రం లోపించింది.రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఈ వానకాలం సీజన్ నుంచి 10 పంటలకు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారంటూ జిల్లా వ్యవసాయాధికారులు పెదవి విరుస్తున్నారు.

మడమ తిప్పిన రేవంత్ ప్రభుత్వం

ఫసల్ బీమా పథకంలో మార్పులు చేసి, రైతును యూనిట్‌గా పరిగణించి రాష్ట్రంలోని ప్రతి రైతుకు మేలు జరిగేలా చూస్తామని రేవంత్‌రెడ్డి సర్కారు గొప్పలు చెప్పింది. కానీ, గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఈ విధానం వల్ల రైతులకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పంటనష్టం అంచనాలో శాస్త్రీయత శూన్యం

భౌగోళిక పరిస్థితులను, ప్రధాన పంటల సాగునుపరిగణనలోకి తీసుకోకుండా గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా పరిగణించి 10 పంటలకు ఫసల్ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు.వీటిలో వరి పంటకు మాత్రమే గ్రామాన్ని యూనిట్‌గా పరిగణిస్తున్నారు. మిగిలిన పంటలకు మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా తీసుకోవడంతో రైతులకు అనేక ఇబ్బందులు తలెత్తడం ఖాయంగా కనిపిస్తున్నది.

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరితోపాటు పసుపు, మొక్కజొన్నను అధికంగా సాగు చేస్తారు. ఈ పంటలకు బీమా పథకాన్ని అమలుకు గ్రామాన్ని కాకుండా మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా పరిగణిస్తున్నారు.
- కంది అధికంగా సాగయ్యే వికారాబాద్ జిల్లాలో ఆ పంటకు బీమాకు గ్రామాన్ని కాకుండా మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

మక్క, కంది,సోయా రైతులకు అన్యాయమే

ప్రభుత్వం అమలు చేయబోతున్న ఫసల్ బీమా పథకం వల్ల రాష్ట్రంలోని మొక్కజొన్న, కంది, సోయా రైతులకు అన్యాయం జరుగనున్నది. ఈ పంటలకు బీమాను వర్తింపజేసేందుకు నిర్మల్ జిల్లాలో మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా తీసుకుంటున్నారు. దీని వల్ల పంట నష్టం జరిగితే వరి రైతులకు తప్ప మిగిలిన రైతులకు పరిహారం లభించడం గగనమే.

రైతును యూనిట్‌గా పరిగణిస్తే..

- పంట నష్టంపై జరిపే సర్వేలో ఒక్కో రైతుకు సంబంధించిన పంట నష్టాన్ని అంచనా వేస్తారు. దీంతో పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం దక్కుతుంది.

గ్రామాన్ని యూనిట్‌గా పరిగణిస్తే..

- గ్రామంలో ఒకవైపు ఎక్కువ, మరోవైపు తక్కువ పంట నష్టం జరిగితే మొత్తం గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని లెక్కిస్తారు. ఇందులో 33% పంట నష్టం వాటిల్లినట్టు నిర్ధారణ అయితేనే రైతులకు పరిహారాన్ని అందజేస్తారు.

మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా ..

- ఒక గ్రామంలో పంటలు దెబ్బతిని, మరికొన్ని గ్రామాల్లో పంటలు బాగానే ఉంటే నష్టపోయిన రైతులకు పరిహారం అందదు.

సోనియా పర్యటనపై సీఎం సమీక్ష

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ వేడుకలకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హాజరువుతుండటంతో కార్యక్రమ నిర్వహణను సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. పరేడ్‌గ్రౌండ్‌లోని ప్రధాన వేడుకల ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలతో సమీక్షించారు. కార్యక్రమానికి కనీసం 25 వేల మంది హాజరయ్యేలా అధికారులకు ప్రభుత్వం టార్గెట్ విధించినట్టు తెలిసింది. హైదరాబాద్ నగరం నుంచే ఎక్కువ మందిని సమీకరించేలా మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి అధికారులతో సమన్వయం చేస్తున్నారు. గత ప్రభుత్వం కంటే భారీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు ఒక అధికారి చెప్పారు. పరేడ్‌గ్రౌండ్‌లో ఆరు గ్యారెంటీలపై ఐఅండ్‌పీఆర్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

సంపదలో అత్యధిక భాగం దాతృత్వానికే

ఓపెన్ ఏఐ సీఈఓ ఆల్ట్‌మన్

వాషింగ్టన్: మానవాళి మేలు కోసం తమ సంపదను త్యాగం చేసే బిలియనీర్ల జాబితాలో ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ చేరారు. తమ సంపదలో అత్యధిక భాగం దాతృత్వానికి అందజేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆయనతోపాటు ఆయన భాగస్వామి ఓలివర్ ముల్హెరిన్ 'ది గివింగ్ ప్లెడ్జ్' దాతృత్వ కార్యక్రమంపై సంతకం చేశారు. ఈ ప్రపంచం అభివృద్ధి చెందడం కోసం అనేక మంది ఎంతో శ్రమిస్తున్నారని, విజ్ఞానం, దాతృత్వం, అంకిత భావాలతో కృషి చేస్తున్నారని, వారు ఏర్పాటు చేసిన వేదిక తాము ఈ స్థాయికి చేరడానికి అవకాశం కల్పించిందని వీరిద్దరూ లేఖలో పేర్కొన్నట్లు ఈ చారిటీ సంస్థ తెలిపింది. 'ది గివింగ్ ప్లెడ్జ్' చారిటీ సంస్థను వారన్ బఫెట్, బిల్ గేట్స్, మెలిందా గేట్స్ 2010లో ప్రారంభించారు. ప్రపంచంలోని సంపన్నులు దానం చేసేలా ఈ సంస్థ ప్రోత్సహిస్తుంది. ఇప్పటి వరకు 30 దేశాలకు చెందిన 240 మంది సంపన్నులు భారీగా విరాళం ఇస్తామని ప్రకటించారు.

పెళ్లయిన 12 రోజులకు భార్య మగాడని తెలిసింది

ఇండోనేషియా యువకుడికి షాక్

జకర్తా, మే 29: కొత్తగా పెండ్లి అయిన ఇండోనేషియా యువకుడికి ఊహించని అనుభవం ఎదురైంది. తన భార్య అమ్మాయి కాదు.. అబ్బాయని తెలిసి అతడు షాక్ తిన్నాడు. పెండ్లయిన 12 రోజులకు ఈ విషయం బయటపడింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. 26 ఏండ్ల యువకుడు గత ఏడాది సామాజిక మాధ్యమంలో పరిచయమైన అదినా కంజాను ఏప్రిల్ 12న వివాహం చేసుకున్నాడు. పెండ్లి అయిన తర్వాత భార్య నిరంతరం ముఖం దాచుకోవడం, దగ్గరకు రాకపోవడం, ఏదో వంక పెడుతూ కలయికకు దూరంగా ఉండటంతో అతడికి అనుమానం వచ్చింది. తీరా విచారించగా విస్తుపోయే నిజాలు తెలిశాయి. వాస్తవానికి తనకు తల్లిదండ్రులు లేరంటూ ఆమె చెప్పినవన్నీ అబద్ధాలని, వారు బతికే ఉన్నారని తెలుసుకున్నాడు. వారి ద్వారా అదినా అమ్మాయి కాదు అబ్బాయి అని తెలిసి విస్తుపోయాడు. తన ఆస్తి కాజేయడానికే అమ్మాయిగా నటించినట్టు తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అదినాను అరెస్ట్ చేశారు.

8 మంది కుటుంబసభ్యుల్ని చంపి ఆత్మహత్య

మధ్యప్రదేశ్‌లో దారుణం

ఛింద్వారా: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో బుధవారం దారుణం జరిగింది. ఈ నెల 21న వివాహం చేసుకున్న వ్యక్తి కర్కశంగా తన భార్య సహా ఎనిమిది మందిని హత్య చేసి, తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బోడల్ కచ్చర్ గ్రామంలో నివసిస్తున్న దినేశ్ సరియమ్ (26) మంగళ-బుధవారాల మధ్య రాత్రి 2.30 గంటల సమయంలో దారుణానికి తెగబడ్డాడు. గొడ్డలితో విచక్షణ లేకుండా తన భార్య, తల్లి, సోదరి, సోదరుడు, వదిన, ముగ్గురు చిన్నారులను హత్య చేశాడు. మేనల్లుడిపై దాడి చేసినప్పటికీ, అతడు ఏదోవిధంగా తప్పించుకోగలిగారు. అనంతరం దినేశ్ ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాథమిక విచారణలో దినేశ్‌కు మానసిక అస్వస్థత ఉన్నట్లు తెలిసింది. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం పంపించారు. గాయపడిన వ్యక్తిని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు.

ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

మిలియన్ మార్చ్ తరహాలో పోరాడుతాం

- కులగణన చేయకుండా ఎన్నికలకు పోవద్దు
- బీసీ కులసంఘాల విస్తృతస్థాయి సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, మే 29: కులగణన చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల ప్రక్రియ చేపడితే మిలియన్ మార్చ్ తరహాలో పోరాటాలు నిర్వహిస్తామని బీసీ కుల సంఘాలు, మేధావుల విస్తృతస్థాయి సమావేశంలో వక్తలు స్పష్టంచేశారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ కులసంఘ